
## నూటయాభై సంవత్సరాల

# కమ్యూనిస్టు ప్రణాళిక



అంజయ్య

చిన్నయసూరి

బాలగోపాల్

సమీక్ష

# కమ్యూనిస్టు మేనిఫెస్టో : ఒక పునః పరిశీలన

కె. బాలగోపాల్★

కమ్యూనిస్టు మేనిఫెస్టో మార్క్సిజానికి ఎంతవరకు ప్రామాణికం అనేది చర్చించవలసిన ప్రశ్నే. దానికంటే జర్మన్ ఐడియాలజీ లోని మొదటి భాగం మార్క్స్ ఆలోచనా సరళికి బాగా అద్దం పడుతుందని వాదించే వాళ్లున్నారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీల ఆలోచననూ ఆచరణనూ ఎక్కువగా ప్రభావితం చేసింది కమ్యూనిస్టు మేనిఫెస్టోయే ననడంలో సందేహం లేదు. అందువల్ల, మేనిఫెస్టోలోని అభిప్రాయాలను చర్చించడం కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంచనా వేయడానికి చాలా అవసరం.

కమ్యూనిస్టు మేనిఫెస్టోకు స్ఫూర్తినిచ్చిన అన్వేషణ ఈనాటికీ అర్థవంతమైనదే. ఆ అన్వేషణ 150 సంవత్సరాల తరువాత కూడ సజీవంగానే ఉంటుందని - ఇంకా ముగియకుండా ఉంటుందని - మార్క్స్‌గానీ ఏంగెల్స్‌గానీ ఊహించి ఉండరు. ఎందుకంటే 19వ శతాబ్దపు మధ్యభాగంనుండీ పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించే కార్మిక విప్లవం ఆసన్నమయిందని వారు భావిస్తూ వచ్చారు. ఆ విప్లవ ప్రయత్నం ఓటమిని చవిచూసినప్పుడు ఆ ఓటమిని వారు వాస్తవికంగానే గుర్తించారు. కానీ ఎప్పటికప్పుడు ఆఖరుదెబ్బ దగ్గరిలోనే ఉందని అనుకుంటూ వచ్చారు.

కానీ ఆ అన్వేషణ ఈనాటికీ సజీవంగానే ఉంది. అది సజీవంగా ఉండడం మేనిఫెస్టో కర్తలకు ఇంకొక రకంగా ఆశ్చర్యం, అసహనం కూడా కల్గించి ఉండేదేమో. సమసమాజాన్ని చాలామంది కాంక్షించారుగానీ ఆ భావనను సహేతుకమైన ప్రాతిపదికపై నిలబెట్టింది తామేనని వారు భావించారు. ఇతర సోషలిస్టు సిద్ధాంత దృక్పథాలను కమ్యూనిస్టు మేనిఫెస్టో 'ఫ్యూడల్ సోషలిజం' 'పెటీబూర్జువా సోషలిజం', 'బూర్జువా సోషలిజం', 'యుటోపియన్ సోషలిజం' అని వర్గీకరించి వివరించి తిరస్కరించింది. కార్మికవర్గం ఆధ్వర్యంలో జరగబోయే స్వంతఆస్తిలేని సమాజం నిర్మాణంలోనే నిజమైన సమసమాజానికి పునాది ఉందని కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రకటించింది. తక్కిన సోషలిస్టు సిద్ధాంతాలను కేవలం తప్పుడు ఆలోచనలు లేక అహేతుకమైన ఆలోచనలు అని కొట్టిపారేయలేదు. నిజమైన సమసమాజ భావనకు కార్మికవర్గ పునాది ఉన్నట్టే తప్పుడు భావనలన్నిటికీ ఏదో ఒక అన్యవర్గ జీవితంలో ప్రాతిపదిక ఉందని – పెట్టుబడిదార్ల చేతిలో దెబ్బతిని పాత ఔన్నత్యం కోసం తపిస్తున్న ఫ్యూడల్ దొరలు కావచ్చు, పెట్టుబడిదారీ

---

★ ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సంఘం.

పురోగమనం వల్ల దెబ్బతిని జీవనం కోల్పోతున్న చేతివృత్తుల వారు కావచ్చు, పాతసమాజాన్ని అంటిపెట్టుకొని ఉన్న రైతాంగం కావచ్చు, పెట్టుబడి దారీ వ్యవస్థలో భాగంగా ఉంటూ కూడా మానవతా దృక్పథంతో సోషలిజాన్ని కాంక్షించే బూర్జువా మేధావులు కావచ్చు, తన బలాన్నీ సంఘటిత శక్తినీ ఇంకా గుర్తించని శైశవదశలో ఉన్న కార్మిక వర్గమే కావచ్చు. ఈ విధంగా సోషలిజానికి సంబంధించిన ప్రతీ ప్రత్యామ్నాయ దృక్పథానికీ ఒక అన్య (లేక అపరిణిత) వర్గ ప్రాతిపదికను గుర్తించటంద్వారా ఇంక ప్రత్యామ్నాయ అన్వేషణకు సాధికారమైన (లెజిటిమేట్) స్థానం లేదన్న ధ్వనితో కమ్యూనిస్టు మేనిఫెస్టో సాగుతుంది. కానీ అన్వేషణ ఈనాటికీ సజీవంగానే ఉంది. కార్మికవర్గ రాజ్యాధికారం ద్వారా సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం ఈ శతాబ్దంలో పలుదేశాలలో జరిగింది. అన్ని ప్రయత్నాలూ విఫలం అయ్యాయి. సిద్ధాంతంలోపమేమీ లేదనీ ఆచరణలో మాత్రమే పొరబాట్లు దొర్లాయనీ అనే వారున్నారు. కావచ్చు, కాకపోవచ్చు. ఆ విషయాన్ని వివరంగా చర్చించడానికిది సందర్భం కాదు. కానీ ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణకు తావు లేదనీ అది ఏదో ఒక అన్యవర్గ ప్రయోజనం నుండే పుట్టాలనీ ఇంక అనడానికి వీలులేదు. ఆ అర్థంలో కూడా కమ్యూనిస్టు మేనిఫెస్టో కర్తలు చేపట్టిన అన్వేషణ ఇంకా సజీవంగానే ఉంది.

కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రతిపాదించిన మార్గం ఎందుకు ఫలితాన్ని ఇవ్వలేదన్న చర్చ ఈనాటి అన్వేషణలో ఒక ముఖ్య విషయం అవుతుంది. ఆ చర్చ మొత్తం ఇక్కడ నేను చేపట్టబోనుగానీ తాను చేసిన ప్రతిపాదనలో భాగంగా మేనిఫెస్టో చేసిన వివిధ సూత్రీకరణలను వాటి సత్యా సత్యాలనూ పరిశీలించడం ఆ చర్చకు ఉపయోగపడగలదు.

నాగరికత పుట్టిననాటి నుండి ప్రపంచ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే ననేది మేనిఫెస్టోలోని ప్రఖ్యాతమైన వాక్యాలలో ఒకటి. ఇది సత్యమేనా? నిజానికసలు పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ వచ్చేవరకు ఎక్కడా సాంఘిక వ్యవస్థ వర్గాల రూపంలోలేదు. స్త్రీ పురుష విభజన ఉంది. భాష, జాతి, మతపరమైన విభజన ఉంది. మనదేశంలో కులాల విభజన ఉంది. శిష్టులు–సామాన్యులు, రాజన్యులు– ప్రజలు, స్వేచ్ఛా జీవులు - బానిసలు, పౌరులు - జానపదులు మొదలయిన వివిధ రకాల విభజనలు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తాయి. వీటన్నిటికీ ఆస్తి సంబంధాలు నిర్ణాయక అంశం కాదు. అన్నిటి మీదా ఉత్పత్తి సంబంధాల ప్రభావం ఉన్నా అదే ప్రధానం కాదు. ఆమాటకొస్తే ఆస్తిసంబంధాల మీద జెండర్ ప్రభావం, కులం ప్రభావం చాలా ఉంది.

మరి ఈ రకరకాల విభజనల ప్రాతిపదికన ఘర్షణలు చరిత్రలో జరగలేదా? అవేవీ చరిత్రను అసలే మార్చలేదా? ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికన జరిగిన పోరాటాలు మాత్రమే చరిత్రను మార్చాయా? వేరేవి ఒక వేళ చరిత్రను మార్చినా, వాటిలో ఆర్థిక పోరాటం దాగి ఉండడం వల్లనే - అవి మారురూపంలో జరిగిన వర్గ పోరాటాలు కావడం వల్లనే- మార్చాయనుకోవాలా? దక్షిణ భారత దేశంలో శైవ వైష్ణవ ఘర్షణ పెద్ద భూస్వాములకూ చిన్న భూస్వాములకూ మధ్య పోరాటం తీసుకున్న రూపం మాత్రమేనని

కోశాంబి అంటాడు. మలబార్‌లోనూ, తూర్పు బెంగాల్‌లోనూ ముస్లింలలో మతపరంగా వచ్చిన ఉద్యమాలన్నీ హైందవ భూస్వాముల దగ్గర కౌలుదార్లుగా ఉన్న ముస్లిం రైతుల వర్గచైతన్యం తీసుకున్న రూపం మాత్రమేనని మార్క్సిస్టు విశ్లేషకులు అంటుంటారు. ప్రాచీన భారత చరిత్రలో వేదకాలం అనంతరం నెలకొన్న స్థిర వ్యవసాయ సమాజంలోని వ్యవసాయ వ్యాపార వర్గాలు పశుబలులపై సంపదను వృధా చేసిన యజ్ఞకాండపై తిరుగుబాటే వైదిక బ్రాహ్మణమతంపైన బౌద్ధం తదితర అబ్రాహ్మణ మతాలు చేసిన పోరాటం అని వ్యాఖ్యానించినవారు చాలామందే ఉన్నారు. ఇది సరయిన విశ్లేషణేనా అన్న ప్రశ్న పక్కన పెడదాం. సామాజిక విషయంలో రెండు అంశాలు కలిసి ఉన్నప్పుడు వాటిలో ఒకటి అసలు విషయమనీ రెండవది దాని రూపం మాత్రమేననీ నిర్ణయించడానికి హేతుబద్ధమైన ప్రాతిపదిక చూపించగలగాలి. లేకపోతే ఈ రకమైన విశ్లేషణలను సిద్ధాంత విశ్వాసం కారణంగా నమ్మవలసిందే. అదెట్లాగున్నా, ఆయా పోరాటాలలోనూ, ఘర్షణలలోనూ పాల్గొన్నవారు తమకే తెలియకుండా ఏవో ఉత్పత్తి సంబంధమైన వర్గ పోరాటాలలో మారురూపంలో పాల్గొన్నారనుకున్నా, వారు ఘర్షణ పడింది వర్గేతర రూపంలో కావడంవల్ల ఆ ఘర్షణకు ఆర్థికేతర పర్యవసానాలు చాలా ఉంటాయి. బ్రాహ్మణ్యంతో బౌద్ధం చేసిన పోరాటం సారాంశంలో వర్గపోరాటమేనని ఒప్పుకున్నా, అది ఈ రూపంలో జరగడం సామాజిక చరిత్ర మీద చాలా ప్రభావం వేసింది. అదే సారాంశం వేరొక రూపం తీసుకొని ఉంటే ఇంకొక రకమైన ప్రభావం ఉండేది. అటువంటప్పుడు మనదేశ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే ననగలమా? శైవ వైష్ణవ ఘర్షణలు సారాంశంలో భిన్న వ్యవసాయవర్గాల మధ్య ఘర్షణ లేననుకున్నా వాటిలో పాల్గొన్నవారు తమ వర్గ స్థితితో సంబంధం లేకుండ శైవులుగా, వైష్ణవులుగా పాల్గొన్నారు. దాని ప్రభావం దక్షిణ భారతదేశంలో కులవ్యవస్థపైన, తద్వారా సామాజిక జీవితంపైన చాలా పడింది. అదే ఘర్షణ ఇంకొక రూపం తీసుకొని ఉంటే (రూపం - సారాంశం అన్న ఈ విశ్లేషణ సరయినదేననుకున్నా) ఈ ప్రభావం ఉండేది కాదు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జాతీయవాదం పేరిట జరిగినప్పటికీ, ఆయా దేశాల గుత్తపెట్టుబడిదారీ వర్గాల మధ్య ఉన్న ఘర్షణ సామ్రాజ్యవాద దశలో తీసుకున్న సంఘర్షణాత్మక రూపమే ఆ యుద్ధాల సారాంశం అన్న విశ్లేషణ చాలా మంది మార్క్సిస్టులు చేసారు. అది (ఏదో ఒక అర్థంలో) నిజమేననుకున్నా, ఆ ఘర్షణ జాతీయఉన్మాదం రూపం తీసుకోవడం వల్లనే యూదులపైన జర్మనీలో భయంకరమైన ఊచకోత జరిగింది. దాని ప్రభావం ఆధునిక ప్రపంచ చరిత్రపైన అనేక రూపాలలో ఉంది. అదే ఆర్థిక సంక్షోభం లేక ఘర్షణ జాతీయఉన్మాదం రూపం తీసుకోకుండా ఉండి ఉంటే (ఇంకేదయినా రూపం తీసుకొని ఉంటే) ఆధునిక చరిత్ర ఇంకొక రకంగా ఉండేది.

ఇటువంటి ఉదాహరణలు చాలా ఇయ్యవచ్చు. చరిత్రలో మనుషులు ఎల్లప్పుడూ వర్గాలు గానే విడిపోయిలేరు, వర్గాలు గానే సంఘర్షించుకోలేదు. అదే సారాంశం, పైకి కనిపించేది రూపం మాత్రమే ననుకుందామంటే ఒక సామాజిక విషయం మరొక సామాజిక విషయంగా పరివర్తన చెందే పరిణామక్రియకు సహేతుకమైన వివరణ ఏదీ

లేకపోగా, ఆయా రూపాలలో జరిగిన ఘర్షణల ప్రభావం ప్రపంచ చరిత్రమీద ఎంత ఉందంటే 'అది రూపం మాత్రమే' అనడంలో అర్థమేమీ కనిపించదు. ఆ ప్రభావాన్ని అర్థం చేసుకునేటప్పుడు మనకు రూపంతోనే ప్రమేయం ఉంటుంది తప్ప దాని వెనుక దాగి ఉందనుకునే 'అసలు విషయం'తో కాదు.

పోతే, వర్గపోరాటమా లేక మరొక పోరాటమా అన్నది పక్కన పెట్టి, అసలు ప్రపంచ చరిత్ర అంతా (ఏదో ఒక) పోరాటాల చరిత్రేనా? మానవ సామాజిక జీవితంలో వచ్చిన మార్పంతా సంఘర్షణల రూపంలోనే వచ్చిందా? చాలా మార్పుకు సంఘర్షణలు మూలం అనేది వాస్తవమే. కానీ నిర్మాణాత్మకమైన అన్వేషణ ద్వారా వచ్చిన మార్పు కూడా చరిత్రలో చాలా ఉంది. ఈరకమైన అన్వేషణను కమ్యూనిస్టు మేనిఫెస్టో కూడా కాదనదు. ఎక్కడో ఒకచోట నిత్యం ఎవరో ఒకరు తమ జీవితాలను బాగుచేసుకోవడం కోసం కొత్త ఉత్పత్తిశక్తుల అన్వేషణలో నిమగ్నమయి ఉంటారు. ఇప్పటికిసాగులోలేని భూమిని సాగులోకి తెచ్చే ప్రయత్నంతో మొదలుపెట్టి కొత్త సాంకేతికప్రక్రియల అన్వేషణ దాకా ఇది అనేక రూపాలలో ఉంటుంది. ఈ అన్వేషణ అనివార్యంగా వర్గఘర్షణకు దారితీయనవసరం లేదు. వర్గ (లేక ఇతర) ఘర్షణలతో కూడి ఉన్నా లేక ప్రశాంతంగా సాగినా ఈ అన్వేషణ చరిత్రలో చాలా మార్పు సమకూర్చింది.

ఈ మాత్రం సవరణ కమ్యూనిస్టు మేనిఫెస్టో రచయితలకు పెద్దగా ఇబ్బందికరంకాదు. నిజానికి మరీ ఇంత దూకుడుగా రాయని ఇతర రచనలలో మార్క్స్, ఎంగెల్స్‌లు ఈ అన్వేషణకు తగు ప్రాముఖ్యం ఇచ్చారు.

కానీ చరిత్రలో చెప్పుకోదగ్గ పాత్ర నిర్వహించిన నిర్మాణాత్మక కృషి వేరే కూడా ఉంది. సంఘజీవిత నియమాల ఆవిష్కరణ ఒక ఉదాహరణ. మానవ సమాజాలు ఎల్లప్పుడూ సమ సమాజాలు కావు గానీ అవి ఎప్పుడూ సమాజాలే! అంటే మనుషులెప్పుడూ సంఘజీవులే. ఆ సంఘజీవితం ఎంత అసమమయినదయినా కావచ్చు గాక. అంతేకాక, అసమాన సమాజంలోపల కూడా పరస్పర సమానత్వం పాటించే ఉపసమాజాలుంటాయి. కాబట్టి పదిమంది ఒక సంఘంగా బ్రతకడానికి కావలసిన నియమాల అన్వేషణ చరిత్ర ఆది నుండి జరుగుతూనే ఉంది. ఇది సాంఘిక నీతి, పరిపాలనా నియమాలు, చట్టాలు, తగవుల పరిష్కారానికి ఉపయోగించే ప్రమాణాలు (వ్యవస్థలు, అవ్యవస్థిత సంప్రదాయాలు కూడా) మొదలయిన రూపాలలో ఉంటుంది. వీటి రూపకల్పనలో ఎప్పుడూ కూడా ఆయా సామాజిక పరిస్థితులలోని వ్యవస్థిత అసమానతల పాత్ర, ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. వాటిని కాపాడడం కోసమే రూపొందించే నియమాలూ ఉంటాయి. కానీ దానితో పాటు సంఘజీవితానికి - అవి ఏ రూపంలో ఉన్నప్పటికీ - అవసరమైన నియమాల ప్రతిపాదన కూడా ఉంటుంది. సాంఘిక నీతి, సంప్రదాయాలు, పరిష్కార వ్యవస్థలూ, ప్రభుత్వ పాలనా నియమాలు, చట్టాలలో సంఘ జీవిత నియమాలు అనేక ఒడిదుడుకులతో ఎదుగుతూ (అప్పడప్పడు తిరోగమిస్తూ) ఉంటాయి. ఇది ఎల్లప్పడూ వర్గ (లేక ఇతర) ఘర్షణల రూపంలోనే జరగనవసరం లేదు. హేతుబద్ధమైన

అన్వేషణ రూపంలో జరగగలదు. చరిత్ర గతిలో ఇది కూడా ఒక ముఖ్య అంశమే.

అబద్ధాలు చెప్పడం తప్పు అనే సంఘజీవిత నియమాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఒక్కొక్క సామాజిక పరిస్థితిలో ఒక్కొక్కరికి సంబంధించి ఈ నియమానికి భిన్నమైన మినహాయింపు లుండగలవు. కొన్ని సందర్భాలలో ఇది కపట రూపం కూడా తీసుకోగలదు. అయినప్పటికీ ఇది 'ఆ సమాజంలో దోపిడీ అసమానతలున్నాయా లేవా , అన్న ప్రశ్న దగ్గరే ఆగిపోనక్కర లేని సాధారణ సంఘ జీవిత నియమం. దీనిని నిక్షిప్తం చేసుకున్న సామాజిక సంప్రదాయాలు, కట్టుబాట్లు, చట్టాలు చరిత్రలో చాలానే వచ్చాయి.

కళాసాహిత్య రంగాల చరిత్రకు కూడ ఇది వర్తిస్తుంది. ఒక నిర్దిష్టమైన జీవిత అనుభవం నుండి (అది 'వర్గ' అనుభవమే కానక్కరలేదు), జీవిత ఘర్షణల నుండి పుట్టిన కళాసాహిత్య వ్యక్తీకరణే కాక, మానవ అస్తిత్వంలో కళాసాహిత్యాల కుండే పాత్ర నుండీ పుట్టిన కళాసాహిత్య అన్వేషణ కూడా ఉంది. మనుషులందరికీ సామాన్యమైన అనుభూతులను మానసిక అవసరాలనూ కాల్పనిక రూపంలో తీర్చడం కావచ్చు, మనుషులు తమ ఉనికిని గురించి (అది భౌతికం కావచ్చు, మానసికం కావచ్చు, వ్యక్తిగతం కావచ్చు, సామాజికం కావచ్చు) తాము స్పష్టంగా గుర్తించలేని (గుర్తించడానికి ఇష్టపడని, ధైర్యం చాలని) సత్యాలను స్పష్టంగా వ్యక్తం చేయడం కావచ్చు . మనకు తెలిసిన చిన్న జీవితానికి సంబంధించిన విషయంగా మనం అనుకుంటున్న దానికి శిల్పం, లేఖనం, కధనం అనే ప్రక్రియల ద్వారా సార్వ జనీనత కల్పించి మనల్ని ఒక పెద్ద జీవితంలో భాగంచేయడం ద్వారా కావచ్చు ; మనుషుల జీవిత అనుభవంలో పాక్షికంగా, అసమగ్రంగా ఉండే (భౌతిక, నైతిక, మానసిక) ఔన్నత్యానికి సమగ్రరూపం ఇవ్వడం ద్వారా కావచ్చు. కళాసాహిత్యాలు మానవ జీవితానికి పరిపూర్తి నిస్తాయి. ఇదొక మానవీయమైన అవసరం. దానికి తగిన రూపాల, ప్రక్రియల, వ్యక్తీకరణ మార్గాల అన్వేషణ సాగుతూనే ఉంటుంది. అప్పటి సామాజిక పరిస్థితులలోని అసమానతలు, ఘర్షణల ప్రభావం కళాసాహిత్యాల పైన ఎంత ఉంటుందో వాటిదగ్గరే ఆగిపోని అన్వేషణకూడా ఉంటుంది. ఇది ఎప్పుడూ సంఘర్షణాత్మకంగానే సాగనవసరం లేదు.

మానవ చరిత్రలో ఘర్షణ, పోరాటం, విప్లవాలే కాక అవిచ్ఛిన్నంగా (అంటే సరళరేఖలో అనుకోకూడదు) సాగే ఆవిష్కరణ కూడ ఉంటుందనేది మార్క్స్ ఒక్క ఉత్పత్తి సాధనాల విషయంలో తప్ప వేరే ఏవిషయంలోనూ ఒప్పుకోడు. ఇది ఆయన తొలినాటి రచనల నుండి చివరి రచనల దాకా ఉన్న గుణం. అందుకే కేపిటల్‌లో (అనుకుంటాను) ఒక చోట 'మనం ప్రాచీన గ్రీకు సాహిత్యాన్ని ఈ నాటికీ ఎందుకు అభిమానిస్తాం?' అన్న ప్రశ్న వేసుకొని, దానికి సులభంగా సమాధానం చెప్పలేకపోవడానికి తానే ఆశ్చర్య పోతూ, మన చిన్నప్పటి చేష్టలు పెద్దయిన తరువాత మనల్ని అలరించినట్టు మానవజాతి చిన్నప్పటి సాహిత్యం పెద్దయిన తరువాత కూడ మానవజాతిని అలరిస్తుంది అని వివరణ ఇస్తాడు. ఇది తిరుక్కురళ్‌కూ మహాభారతానికీ కూడా వర్తిస్తుంది కాబోలు. కానీ మానవజాతి చిన్న తనాన్ని 'తమ' బాల్యంగా భావించే మనుషులెవరూ లేరు. సాహిత్యాన్ని మాత్రం

మనం ఒక 'జాతి'గా అభిమానించం, వ్యక్తులుగా అభిమానిస్తాం. అప్పటి సామాజిక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపించడం ఆసాహిత్యానికి ఈనాడు కూడ ఉండే విలువకు ఒక కారణం కావచ్చు. అయితే అప్పటి సామాజిక జీవితాన్ని తెలుసుకోవాలన్న కుతూహలం అందరిలోనూ ఎందుకుంటుంది ? అప్పటి సామాజిక వ్యవస్థకూ ఇప్పటి సామాజిక వ్యవస్థకూ తేడాలెన్ని ఉన్నప్పటికీ మానవ వ్యవహారాలలో సర్వత్రా తలెత్తే విషయాల గురించి బలమైన చర్చ లేక హృద్యమైన వ్యక్తీకరణ లేక ఆలోచనాత్మకమైన వివేచన ఏదో ఉండబట్టే ప్రాచీన సాహిత్యం ఈనాటికీ నిలిచిపోగలిగింది.

ఈ ప్రశ్నను కమ్యూనిస్టు మేనిఫెస్టో చర్చించింది. 'మతం, నీతి, తాత్విక చింతన, న్యాయసిద్ధాంతాలకు సంబంధించిన భావనలలో చారిత్రకంగా మార్పులొచ్చిన మాట వాస్తవమే గానీ, ఎన్ని మార్పులొచ్చినా మతం అనేది ఎప్పుడూ ఉంది, నైతికత ఎప్పుడూ ఉంది, తాత్విక వివేచన ఎప్పుడూ ఉంది, న్యాయశాస్త్రం ఎప్పుడూ ఉంది కదా ' అనీ, 'అంతేకాక అన్ని సామాజిక దశలలోనూ స్వేచ్ఛ, న్యాయం మొదలయిన సార్వత్రిక సత్యాలకు గుర్తింపు ఉందికదా' అనీ, 'మరి కమ్యూనిస్టులు ఈ సార్వత్రిక సత్యాలకూ మతానికీ నీతికీ కొత్త ప్రాతిపదిక కల్పించే బదులు వాటిని రద్దు చేస్తామనడం న్యాయమా' అనీ తమ విమర్శకులు అంటారని మేనిఫెస్టో గుర్తిస్తుంది. దానికి జవాబుగా, ఇప్పటిదాకా గడచిన చరిత్రలో మార్పుతో బాటుగా అవిచ్ఛిన్నత, లేక కొనసాగింపు, ఉండటానికి కారణం ఇప్పటిదాకా ఎన్ని సామాజిక వ్యవస్థలు ఉనికిలోకి వచ్చినప్పటికీ అవన్నీ శ్రమదోపిడీ మీద, వర్గ వైషమ్యాల మీద ఆధారపడినవే కావడం అని వివరిస్తుంది. అందువల్ల వాటి మధ్య ఎంత భిన్నత్వం ఉన్నా, ఎంత వైవిధ్యం ఉన్నా అవన్నీ కొన్ని సామాన్య రూపాలలోనూ కొన్ని సాధారణ భావనల పరిధిలోనూ పరిభ్రమిస్తుంటాయనీ, శ్రమదోపిడీ పోయిన తరువాతే ఇవి పూర్తిగా రద్దయిపోతాయనీ అంటుంది.

స్వేచ్ఛ, న్యాయం మొదలైన భావాలలోనూ సంఘజీవిత నియమాలలోనూ (నీతి, న్యాయశాస్త్రం) చరిత్రలోనూ (మార్పుతో బాటు) కనిపించే అవిచ్ఛిన్నతకు, అంటే ఒక చారిత్రక దశనుండి మరొక చారిత్రక దశకు ఈ విలువలలో ఆలోచనలలో కొన్ని కొనసాగడానికి కారణం ఇదేనా? జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ సమాధానంలో మూడు విషయాలున్నాయి. 1) ఒక చారిత్రకదశ నుండి మరొక చారిత్రకదశకు ఏ ఒక్క విషయంలోనైనా కొనసాగింపు లేక సామాన్య లక్షణాలు ఉండాలంటే, రెండింటి ఉత్పత్తి వ్యవస్థలలో ఏదో ఒక సామాన్య అంశం ఉండాలి. ఉత్పత్తి వ్యవస్థ సమాజాల మధ్య అంతటి అగాధాలు కల్పిస్తుంది. 2) నైతిక విలువలు, తత్వశాస్త్రం, న్యాయ సిద్ధాంతం మొదలయినవి శ్రమ దోపిడీ ఉన్న సమాజంలోనే ఉంటాయి. శ్రమదోపిడీ లేకపోతే ఇవి ఉండవు. (లేదా వీటి అవసరం లేదు) ఇప్పటిదాకా చరిత్ర అంతా దోపిడీవ్యవస్థల చరిత్రే కాబట్టే అన్ని చారిత్రక దశలలోనూ ఇవి ఉన్నాయి. 3) వర్గరహిత సమాజంలోమనుషులు స్పాంటేనియస్‌గా - ఒక నియమం, ఒక న్యాయవ్యవస్థ అక్కర లేకుండా - నీతిగా న్యాయంగా స్వేచ్ఛగా ఉంటారు. నీతిశాస్త్రం, న్యాయ సిద్ధాంతం అక్కరలేదు.

విలువలూ నీతినియమాల విషయంలో ఆర్థిక నిర్ణాయక వాదాన్ని ఇంత దూరం తీసుకు పోయే వైఖరి కమ్యూనిస్టు ఉద్యమానికి చాలా నష్టం చేసింది. ఈవైఖరిని మార్క్స్ తన చివరి రోజులు దాకా కూడా మార్చుకున్న దాఖలాలు లేవు. ఈ అతివాద వైఖరివల్ల కమ్యూనిస్టులు మానవ నాగరికతలోని నైతిక అంశాన్ని కేవలం విమర్శించడమే తప్ప పెంపొందించే కర్తవ్యం తమది కాదనుకున్నారు. ఈ వైఖరి నష్టం అంతా యింతా కాదు.

అంతేకాక, ఒక చారిత్రకదశనుండి మరొక చారిత్రకదశకు ఉత్పత్తి శక్తులు తప్ప వేరే ఏదీ కొనసాగదన్న సిద్ధాంతం వల్ల, కాలక్రమంలో ఎదిగే నాగరికత కేవలం సాంకేతిక సామర్థ్యానికీ దాని పర్యవసానాలయిన సంపద, జ్ఞానం, భౌతిక జీవిత వైవిధ్యం, విస్తృతులకు సంబంధించిన విషయం అయింది. మేనిఫెస్టో నాగరికత అనే మాటను వీటికి సమానార్థకంగా వాడుతుంది. నాగరికత అంటే భౌతిక నాగరికతే. మామూలుగా నాగరికత భావనలో ఉండే ఇతర విషయాలు ఆ భౌతిక నాగరికతలోని దోపిడీ అసమానతల నుండి పుట్టినవి. వాటిని కప్పిపెట్టే భావజాలం కావచ్చు, లేదా వాటినుండి పుట్టే బాధకొక తాత్కాలిక ఉపశమనం కావచ్చు, కానీ మొత్తానికి దోపిడీ అసమానతల నుండి పుట్టినవే. నాగరికత అనే భావనలో మనుషులు తమ భిన్న ( భౌతిక, మానసిక, వ్యక్తిగత, సామాజిక) అవసరాలు తీర్చుకోవడానికి సృష్టించుకున్న ఇతర సాధనాలకు చోటు లేకుండా పోయింది. వర్గరహిత సమాజం వచ్చిన తరువాతే ఆ ప్రయత్నానికి అర్థం వస్తుంది. అప్పుడు మనుషులు రూపకల్పన చేయబోయే నాగరికతకు ఇప్పుడున్న నాగరికతకూ పోలికేమీ ఉండదు. ఎందుకంటే ఇప్పుడున్నదంతా దోపిడీ పీడనల నుండి పుట్టి దానికొక సాధనంగానో భావజాలంగానో మహా అయితే ఆ బాధను ఉపశమింపచేసే మత్తుమందుగానో పనిచేస్తుంది - అందుకోసమే కల్పించబడింది - కాబట్టి.

గతానికీ భవిష్యత్తుకూ మధ్యన ఇంతటి అగాధాన్ని ఊహించుకోవటం వల్ల మానవ నాగరికత పురోగమనంలో కమ్యూనిస్టులు ఎంత నిండుగా పాల్గొనాలో అంత నిండుగా పాల్గొనలేక పోయారు. ఒక్కొక్కసారి విధ్వంస వైఖరిని ప్రదర్శించారు కూడ.

కార్మిక విప్లవం దగ్గరకు తిరిగి వద్దాం. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకూ తత్పూర్వ వ్యవస్థలకూ మధ్యనున్న తేడాను కమ్యూనిస్టుమేనిఫెస్టో వివరిస్తుంది. అంతకు ముందున్న సమాజాలలో దొంతరలుగా అనేక వర్గాలుండేవని అంటుంది. వాటిని ఏకరవు పెడుతుంది. ఈ జాబితా కేవలం ఆర్థికవర్గాలకే పరిమితం అయినప్పటికీ పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలోని వైవిధ్యాన్ని గుర్తిస్తుంది. కాగా, బూర్జువా వ్యవస్థ సామాజిక వర్గీకరణను చాలా సరళం చేసిందనీ అది దాని ప్రత్యేక లక్షణమనీ మేనిఫెస్టో అంటుంది. బూర్జువాలు, కార్మికులు అన్న రెండువర్గాలు మాత్రమే ఇక్కడ ఉన్నాయనీ తక్కిన వర్గాలన్నీ వేగంగా దీనిలోనో దానిలోనో (ఎక్కువ భాగం కార్మిక వర్గంలోనే) కలిసి పోతాయని, కలిసి పోతున్నాయనీ సూత్రీకరిస్తుంది.

కార్మిక విప్లవం త్వరలో రానున్నదన్న నమ్మకానికి ఈ అభిప్రాయం చాలా ఊతం ఇచ్చిందనడంలో సందేహం లేదు. అయితే చాలా మంది పరిశీలకులు గుర్తించినట్టు

బూర్జువావ్యవస్థ వర్గవిభజనను సరళం చేయలేదు. కార్మిక వర్గంలోనే అనేక ఉపవర్గాలు వచ్చాయి. క్యాజువల్ కార్మికులు, పర్మినెంట్ కార్మికులు, 'స్కిల్' ఉన్నవారు, అది లేనివారు (నిజానికి 'స్కిల్' లేని పని ఏదీ లేకపోయినప్పటికీ), వైట్ కాలర్ కార్మికులు, బ్లూ కాలర్ కార్మికుల, ప్రభుత్వరంగ కార్మికుల, ప్రైవేటురంగ కార్మికులు, ప్రైవేటులో మళ్లీ కార్పొరేట్ రంగకార్మికులు, అనియతరంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అన్ని రంగాలలోనూ స్త్రీ కార్మికులు, మగ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, వ్యవసాయకార్మికులు అంటూ కార్మికులలోనే తేడాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అందరినీ ఒక కోవకు కుదించివేస్తుందన్న మేనిఫెస్టో అభిప్రాయం నిజం కాకపోగా, ఆ వ్యవస్థ ఎదిగిన క్రమంలోనే కొత్త విభజనలు వచ్చాయి. కార్మికవర్గంలో పైభాగాన ఉన్న వారు మధ్య తరగతికి చాలా దగ్గరయ్యారు.

ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీపూర్వ ఆర్థిక వ్యవస్థలలోని వర్గ విభజనలో ఎంతటి సంకీర్ణత ఉండిందో అంత సంకీర్ణత – బహుశా అంతకంటే ఎక్కువ సంకీర్ణత – ఇప్పుడు బూర్జువా ఆర్థిక వ్యవస్థలోను ఉంది. సోషలిస్టు విప్లవం కమ్యూనిస్టు మేనిఫెస్టో ఊహించిన రీతిలో రాకపోవడానికి ఇదొక ముఖ్య కారణం అని గత 50 సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన దేశాలలోని మార్క్సిస్టులు గుర్తిస్తున్నారు.

మరొక ముఖ్యమైన విషయంలో కూడా మేనిఫెస్టో తప్పగా ఊహించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు పోను పోను మరింత పేదవారవుతారని మేనిఫెస్టో అంటుంది. వేరే రచనలలో కూడా, సమాజంలో సంపద పెరిగే కొద్దీ ఆ సంపదను సృష్టించే కార్మికులు మరింతగా పేదలవుతారని మార్క్స్ అంటాడు. అయితే ఇతర రచనలలో (ముఖ్యంగా కేపిటల్) ఆయన కార్మికులు సాపేక్షంగా పేదలవుతారన్నాడు తప్ప నిజంగానే పేదలవుతారని అనలేదని (అంటే పెరుగుతున్న సంపదలో కార్మికుల వాటా క్రమంగా పడిపోతుందని అన్నాడు తప్ప నిజంగానే కార్మికుల ఆదాయం పడిపోతుందన లేదని) వాదించే అవకాశం ఉంది. లేదా పేదరికం అన్నప్పుడు భౌతిక (ఆదాయ సంబంధమైన) అర్థంలో కాక, తన సృజనాత్మకతనూ వ్యక్తిత్వాన్నీ కోల్పోవడం అనే అర్థంలో తీసుకోవాలని వాదించే అవకాశం ఉంది. కానీ మేనిఫెస్టో స్పష్టంగానే కార్మికుల జీవన ప్రమాణం క్రమంగా పడిపోతుందని అంటుంది. సాపేక్షంగా మాత్రమేనని ఇప్పుడు దానిని వ్యాఖ్యానించుకోవడానికి అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు గానీ ఇక్కడొక సమస్య ఉంది. కార్మికులు మరింతగా నిజంగానే పేదవారయ్యేటట్లయితే బూర్జువా వ్యవస్థ మీద కసి పెంచుకొని దానిని కూలదోస్తారనుకోవచ్చును. మేనిఫెస్టో ఆమాటే అంటుంది. కానీ కేవలం సాపేక్షంగానే కార్మికుల దారిద్ర్యం పెరిగేటట్లయితే వారిలో అంత కసి పెరుగుతుందన్న నమ్మకం ఏముంది? యజమాని ఆస్తి పెరుగుతున్నంత వేగంగా తన జీతం పెరగడం లేదన్న విషయం కార్మికునిలో అసంతృప్తి కలిగించవచ్చును గానీ యజమాని వర్గాన్ని కూలదోసేంత వర్గకసి పెరుగుతుందన్న హామీ ఏమీ లేదు. పరాయీకరణ వల్ల కార్మికులు తమ వ్యక్తిత్వాన్నీ గుర్తింపునూ కోల్పోవడం విషయం కూడా అంతే. అదే క్రమంలో ఆదాయాలు కూడా పెరిగినట్టయితే పెరిగిన ఆదాయం కంటే

కోల్పోయిన వ్యక్తిత్వానికీ గుర్తింపుకూ కార్మికులందరూ ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారన్న భరోసా లేదు.

అదెట్లాగున్నా, నిజంగానే కాలక్రమంలో కార్మికులు మరింత దరిద్రులవుతారన్నదే మేనిఫెస్టో అభిప్రాయం. కార్మిక విప్లవం ఆసన్నం అయిందన్న మేనిఫెస్టో విశ్వాసానికిది ఒక ముఖ్య ఆధారం. పెట్టుబడిదారీపూర్వ వ్యవస్థలు శ్రామిక ప్రజలను కొంత మేరకైనా సంతృప్తి పరచడానికి వారి బాగోగులను చూసుకున్నాయిగానీ బూర్జువావ్యవస్థ మాత్రం కార్మికులను పీల్చి పిప్పిచేసి మరింత లాభాలు సంపాదించుకునే పోటీలో అటువంటి అవకాశమేదీ ఇవ్వదని మేనిఫెస్టో అంటుంది. అందువల్ల మరింతగా పేదరికంలోకి దిగజారే కార్మికులకు బూర్జువా వ్యవస్థను కూలదోయడంతప్ప గత్యంతరం లేదంటుంది. కానీ కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రకటించిన తరువాత గడచిన 150 సంవత్సరాలలో పాశ్చాత్య దేశాల కార్మికులు తమ నిజవేతనాలను ఎన్నోరెట్లు పెంచుకున్నారు. గతంలో ఏ ఆర్థిక వ్యవస్థలోనూ పెరగనంతగా శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి.

ఈ పెరుగుదల పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదరూపం తీసుకోవడం వల్లనే జరిగిందనీ, వలస, వలసానంతర దేశాల శ్రామికులను మరింత దోచుకోవడం వల్లనే జరిగిందనీ విశ్లేషించవచ్చును. పాశ్చాత్య దేశాలలో సర్వత్రా పెరిగిన ఆదాయాల వెనుక సామ్రాజ్యవాద దోపిడీ ఉన్నమాట వాస్తవమే. కానీ వలస, వలసానంతర దేశాలలో సహితం పెట్టుబడిదారీ దోపిడీకి లోనయిన తరువాత నిజవేతనాలు పడిపోయిన కార్మికులున్నట్టే, పెంచుకున్న కార్మికులూ ఉన్నారు.

ఇది పెట్టుబడిదార్ల దయవల్ల జరగలేదు. కార్మికపోరాటాల వల్ల, ప్రగతిశీల రాజకీయ ఉద్యమాలు తీసుకొచ్చిన సంస్కరణల వల్ల జరిగింది. వాటి వెనుక మార్క్సిజం ప్రభావం ఉంది. అయినప్పటికీ దీనివల్ల పెట్టుబడిదారీవ్యవస్థ కూలిపోలేదు. అది వర్ధిల్లుతూనే ఉంది. ఎప్పటికప్పుడు - మేనిఫెస్టో కాలం నుండి కమ్యూనిస్టులు ఊహించుకున్నదానికంటే ఎక్కువ నిలకడ ప్రదర్శిస్తూనే ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ మనమీద రుద్దుతున్న జీవితమంటే మనకు ఎంత అసహ్యం ఉన్నా వాస్తవాన్ని గుర్తించక తప్పదు.

కార్మికుల నిజవేతనాలు పడి పోతాయని మేనిఫెస్టో నమ్మడానికొక కారణం ఉంది. యంత్రాలు మరింత ఎక్కువగా వాడకంలోకి వచ్చేకొద్దీ కార్మికుడు కేవలం దానికి అనుబంధమైన ఒక పరికరంగా మారిపోతాడు. అతని జ్ఞానం పెరగదు. నైపుణ్యం పెరగదు. కాబట్టి అతను ఫ్యాక్టరీలో ఖర్చు చేసే శ్రమశక్తి ఖరీదు పెరగదు. ఆ శ్రమశక్తి పునరుత్పత్తికి అయ్యేఖర్చు కేవలం కార్మికుడు భౌతిక పునరుత్పత్తికి - అంటే తిండి, బట్ట, తదితర కనీస అవసరాలకు - అయ్యే ఖర్చు. అందువల్ల కార్మికుల వేతనాలు పెరగవని మేనిఫెస్టో అంటుంది. కానీ నిజానికి ఈ పరిణామం ఒక సరళరేఖలో జరగలేదు. కొన్ని రంగాలలో యంత్రాల వాడకం పెరిగే కొద్దీ వాటితో పనిచేసే కార్మికులకు అవసరమైన విద్య, నైపుణ్యం పెరిగాయి. కొన్ని రంగాలలో తగ్గాయి. చేతివృత్తుల దశలో కార్మికులకు తమ

ఉత్పత్తిప్రక్రియమీద ఉన్న అజమాయిషీ - అందులో ఉన్న సంతృప్తి - ఆధునిక ఫ్యాక్టరీలో లేని మాట సత్యమే. అయినా సాంకేతిక జ్ఞానం పూర్తిగా క్షీణించిపోయి కార్మికులు యంత్ర పరికరాలలో ఒక పరికరంగా మారిపోయారనీ వారి శ్రమశక్తి పునరుత్పత్తిలో కేవలం తిండి తదితర కనీస అవసరాల ఖర్చు తప్ప వేరే ఏమీ కాదనీ అనుకోవడం వాస్తవికం కాదు. ఇప్పుడు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పెరిగే కొద్దీ పెట్టుబడికి అవసరం అయిన కార్మికుల సంఖ్య (పెట్టుబడికి సాపేక్షంగా) పడిపోతుంది గానీ ఆ కొద్ది మంది విద్యా ప్రమాణాలు హెచ్చుగానే ఉంటాయి. ఈవిషయాలను మార్క్స్ వేరే సందర్భాలలో, ముఖ్యంగా కేపిటల్‌లో గుర్తించకపోలేదు గాని మేనిఫెస్టో లో ఈ అభిప్రాయానికి కీలకస్థానం ఉంది. నేర్పరితనమంతా యంత్రంలోనే ఉండడం వల్ల శ్రమశక్తి ఉత్పత్తికి పెద్దగా ఖర్చుకాలేదని అందువల్ల కార్మికుల వేతనాలు పెరగవనీ, కార్మికుల జీతాలు ఎంత పెరిగితే పెట్టుబడిదార్ల లాభాలు అంత తగ్గుతాయి కాబట్టి ఆ కారణంగా కూడా పరస్పర లాభాలపోటీలో ఉన్న యజమానులు జీతాలు పెరగనివ్వరనీ ఆ కారణాల వల్ల కార్మికుల పేదరికం రోజురోజుకు పెరిగి వారు తిరుగుబాటుదార్లవుతారనీ మేనిఫెస్టో అంటుంది. నిజమే, మేనిఫెస్టో కేవలం దారిద్ర్యాన్నే కాక కార్మికుడి పరాయీకరణ గురించి కూడా మాట్లాడుతుంది. యంత్రంలో నిక్షిప్తమయిన మృత శ్రమ సజీవ శ్రమమీద పెత్తనంచేసే వైనాన్ని వివరిస్తుంది. పెట్టుబడిదారీ దోపిడియేగాక ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్ నిరంకుశ అజమాయిషీ కూడా కార్మికుడిపైన ఒక పీడనగా పనిచేస్తుందని గుర్తిస్తుంది. ఇవన్నీ కలిసి కార్మికులను విప్లవకారులుగా మారుస్తాయని అంటుంది. కానీ పెట్టుబడి దారీ వ్యవస్థ పురోగమన క్రమంలో కార్మిక వర్గంలోని ఒక్కొక్క శ్రేణి తన ఆదాయాన్ని పెంచుకుంటూ పైకి పోసాగింది. మిగిలిన కారణాలు దీనిని అధిగమించి కార్మికులలో విప్లవ చైతన్యాన్ని నిలబెట్టలేకపోయాయి.

కార్మికుల పేదరికం పెరిగిందా లేదా, పెరగకున్నా, బూర్జువా వ్యవస్థను ద్వేషించడానికి కార్మికులకు ఇతర కారణాలున్నాయా లేదా అన్న ప్రశ్న కొంచెం సేపు పక్కన పెడదాం. అయితే కార్మికులు వట్టి కార్మికులు కారు, వారికి జాతీయత ఉంటుంది. మత భావాలుంటాయి. స్త్రీపురుష విభేదం ఉంటుంది. భాషాపరమైన ఐడెంటిటీ ఉంటుంది, మనదేశంలో నయితే కులం ఉంటుంది. పాశ్చాత్య దేశాలలో కూడా నలుపు - తెలుపు అన్న వర్ణభేదం ఉంటుంది. ఇవన్నీ కార్మికులను విభజించి ఐక్యతకు నష్టం చేయవా? పైగా, శ్రమదోపిడీ నుండి విముక్తి కోరుకునే కార్మికులలో అనేకులు ఇతర రూపాలలో ఆధిపత్య శ్రేణులకు చెందినవారయి ఉండవచ్చు. దాని ఫలితంగా వారి లోని సమానత్వ కాంక్ష బలహీనపడదా? 'మేము ఎవరిదోపిడీకీ లోను కాదలచుకోలేదు'. అని ప్రకటించే ముందు తమపైన అదే డిమాండు తమ కంటే తక్కువ స్థాయిలో ఉన్నవారు (కులాలకు చెందినవారు) పెట్టగలరన్న స్పృహవచ్చి వారి ఉత్సాహం కుంటుపడదా ?

పెట్టుబడిదారీ మార్కెట్‌లోని పోటీ కార్మికులను చీలుస్తుందని మేనిఫెస్టో గుర్తిస్తుంది. బహుశా జాతీయత, ప్రాంతం వంటి తేడాలను కూడా గుర్తిస్తుంది. కాబట్టి వర్గఐక్యత రూపొందించుకోవలసిందే తప్ప పుట్టుకతోనే ఉనికిలో ఉన్నది కాదని

గుర్తిస్తుంది. అయితే మేనిఫెస్టో గుర్తించేది ఈ పరిమితమైన అనైక్యతా హేతువులను మాత్రమే. మిగిలినవి బూర్జువావ్యవస్థ వల్లనే అంతరించి పోతాయని మేనిఫెస్టో భావిస్తుంది. కార్మికుడికి తన భార్యాపిల్లలతో ఉండే సంబంధానికీ బూర్జువావర్గంలోని మగవాళ్లకు తమ భార్యాపిల్లలతో ఉన్న సంబంధంతో అసలేమీ పోలిక లేదని మేనిఫెస్టో అంటుంది. పెట్టుబడి ఇంగ్లండులోనయినా అమెరికాలోనయినా ఫ్రాన్స్‌లోనయినా ఒకటే కాబట్టి కార్మికుడికి దేశం లేదు, జాతి లేదు అంటుంది. కార్మికుల మధ్య పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే తలెత్తే భేదాలు సహితం ఆ క్రమంలోనే తొలగిపోతాయంటుంది. యంత్రాల ప్రాముఖ్యం పెరిగి కార్మికులు యంత్రానికి ఒక అనుబంధ పరికరంగా మారిన కొద్దీ కార్మికుల మధ్య ఉత్పత్తి క్రమంలోనూ తేడాలు లేకుండా పోతాయంటుంది.

కార్మికుల గురించి మేనిఫెస్టో చేసిన ప్రతిపాదనలను అర్థం చేసుకునే ముందు ఈనాటి ఫ్యాక్టరీ కార్మికులకూ 150 ఏళ్లనాటి ఫ్యాక్టరీ కార్మికులకూ మధ్య చాలా తేడాఉందని గుర్తించాలి. విపరీతమైన శ్రమ దోపిడీ, పేదరికం, ఏ చట్టాలూ ఏ హక్కులూ లేని పరిస్థితి ఆనాడు ఉండింది. అటువంటి వారికి జాతి ఎక్కడిది, భాష ఎక్కడిది, ప్రాంతం ఎక్కడిది అనుకోవడం మరీ విడ్డూరం కాదు. దీనిని దృష్టిలో పెట్టుకున్నప్పటికీ ఆ దృక్పథంలోని లోపాలను గుర్తించాలి. కార్మికులు ఎంతగా ఒకే రకమైన శ్రమదోపిడీకి గురైనా వారిలో జాతీయత, ప్రాంతీయత తదితర భావాలు అంకురించకుండా పోలేదనీ, ఎంత శ్రమదోపిడీకి తాము గురయినా తాగి ఇంటికొచ్చి భార్యను కొట్టకుండా ఉండలేదనీ కమ్యూనిస్టు పార్టీలే తరువాత కాలంలో గుర్తించాయి. మార్క్స్ ఎంగెల్స్‌లకు కూడా ఇది తెలియని విషయం అయి ఉండదు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఈ కార్మికులు వారి వారి దేశాల, జాతుల మధ్య చీలిపోయి దేశభక్తి ఉన్మాదంలో పాలుపంచుకోవడం కార్మికోద్యమ అంతర్జాతీయతను తీవ్రంగా దెబ్బదీసింది. కార్మిక నాయకులనూ ఆయా దేశాలకు చెందిన వామపక్షపార్టీల నాయకులను లెనిన్ సోషల్ షావనిస్టులు అని నిందించాడు గానీ ఇది కేవలం నాయకుల జబ్బు కాదు. కార్మికులే మెజారిటీగా చీలిపోయారు. ఉత్పత్తి సంబంధాలలో మనిషికుండే స్థానమే మనిషి ఆలోచనలనూ వ్యక్తిత్వాన్ని, సంపూర్ణంగా నిర్ణయిస్తుందన్న అతివాద వైఖరి (మేనిఫెస్టోలో ఇది స్పష్టంగా ఉంది) నుండి కార్మిక వర్గాన్ని గురించి ఏర్పరచుకున్న అభిప్రాయాలకు వాస్తవికతలో ప్రాతిపదిక లేదని ఆ తరువాత కూడా అనేక ఘటనలు రుజువు చేసాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికులను భాష, జాతి, జెండర్ వగైరాలేవీ లేని వట్టి కార్మికులుగా మార్చడం మాత్రమే కాదు. మొత్తంగా సమాజాన్నే తననమూనాలో తిరిగి రాస్తుందని మేనిఫెస్టో భావిస్తుంది. తన అవసరాలకు తగినట్టు అన్నిటినీ అంతటినీ రూపకల్పన చేస్తుంది. ఇక్కడ నిర్ణయవాదం మాత్రమే కాక పెట్టుబడివ్యాప్తికి ఉండే గాఢత గురించి కూడా ఒక అభిప్రాయం ఉంది. నిజంగానే పెట్టుబడికి మతం, కళలు, నీతి, కుటుంబం మొదలయిన ప్రతీ ఒక్క విషయాన్ని తన నమూనాలో పూర్తిగా తిరగ వ్రాయవలసిన అవసరం ఉందా? అన్నిటి మీదా పెట్టుబడి తన ప్రభావం బలంగా వేసిన మాట వాస్తవమే. కానీ ఏదీ తన పూర్వకాలపు స్వభావాన్ని పూర్తిగా కోల్పోలేదు. అది

పెట్టుబడికి ఎందుకు అవసరం ?

మనిషికీ మనిషికీ మధ్య స్వార్థరహితమైన బాంధవ్యమేదో ఉందన్న మధ్యయుగాల భావజాలాన్నీ కృత్రిమమైన సెంటిమెంట్లనూ మత సంబంధమైన ఉద్విగ్నతనూ ధ్వంసంచేసి వట్టి డబ్బుసంబంధాన్నీ లాభాలు లెక్కబెట్టే స్వార్థాన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ వాటి స్థానంలో నిలబెట్టిందని మేనిఫెస్టో ప్రశంసాపూర్వకంగా అంటుంది. ప్రశంస ఎందుకంటే ఆ మధ్యయుగాల భావాలు పూర్తిగా కృత్రిమయినవి, దోపిడీకి అందమైన ముసుగు తొడిగే సాధనాలు కాబట్టి. ఆ ఆచ్ఛాదనను తొలగించి ఉన్నదున్నట్లు చెప్పడం ప్రశంసనీయమేమరి. కానీ పెట్టుబడిదారీ పూర్వదశలో మనిషికీ మనిషికీ మధ్యనున్న సంబంధాలలోని విలువలన్నీ కృత్రిమమైనవేనా, కేవలం దోపిడీకి అందమైన ఆచ్ఛాదనయేనా, లేక దానితో పాటు వాటిలో మానవ అవసరాలకు తగిన హేతుబద్ధమైన అంశమేమైనా ఉందా అన్న ప్రశ్న అటుంచి గత కాలపు ఆలోచనలనూ సంస్కృతినీ పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా నాశనం చేయలేదనేది ఈ 150 సంవత్సరాల అనుభవం. వాటన్నిటి మీదా పెట్టుబడి తన ముద్రవేసింది. ఒక మేరకు అన్నిటినీ వ్యాపారానికి వస్తువులుగా మార్చింది. కానీ అవి పూర్తిగా చావలేదు. కొన్ని విలువలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని అమానవీయమైన సంస్కృతిపట్ల నిరసనను సమీకరించే ఆలోచనలుగా కొనసాగుతున్నాయి. కొన్ని (ఉదాహరణకు మతం, ఆధ్యాత్మికత) ప్రజలలోనే గాక అధికార సంస్కృతిలోను వర్ధిల్లుతున్నాయి.

దీనిని ఏవిధంగా అర్థం చేసుకోవాలి ? ఒక వివరణ నిర్ణయవాదాన్ని విడిచి పెట్టకుండానే - అంటే సమాజంలోని ప్రతీఅంశం మౌలికంగా పెట్టుబడి అవసరాలకు తగిన రూపంలో ఉంటుందన్న అభిప్రాయాన్ని విడిచి పెట్టకుండానే- గతకాలపు విలువల కొనసాగింపును వ్యాఖ్యానిస్తుంది. ఆ విలువలూ సంప్రదాయాలూ తనకు కూడా భావజాలంగా పనికొస్తాయని గుర్తించిన తరువాత - ముఖ్యంగా సామ్రాజ్యవాదదశలో- పెట్టుబడిదారీ వ్యవస్థ అవి కల్పించే ఆచ్ఛాదనను తాను కూడా వాడుకుంటూ ఉందని వాటిని పెంచి పోషిస్తూ ఉందనీ ఈ వ్యాఖ్యానం చెప్తుంది. తొలినాడు మధ్యయుగాల సంస్కృతిలోని అనేక సెంటిమెంట్లమీద యుద్ధం ప్రకటించి, హేతుబద్ధమైన స్వప్రయోజనం తప్ప మనుషులమధ్య వేరే ఏ సంబంధం లేదని వాదించిన బూర్జువావర్గం తరువాత కాలంలో తన ఉనికికి కూడా ఆ భావాలు పనికొస్తాయని గుర్తించిందని ఈ వ్యాఖ్యానం అంటుంది. అయితే, అసలు ఉత్పత్తి వ్యవస్థకు అంత సంపూర్ణంగా ప్రతీ ఒక్క విషయాన్నీ నిర్ణయించాల్సిన అవసరం గానీ అంతటి ప్రభావం గానీ ఉంటుందా? ఎందుకుండాలి? చారిత్రక భౌతికవాదానికి తర్కబద్ధమైన ప్రాతిపదిక కల్పించడానికి ప్రయత్నించిన కొహెన్ వంటి ఎనలిటికల్ మార్క్సిస్టులు, ఉత్పత్తివ్యవస్థతో - అంటే ఉత్పత్తి మారకాల క్రియతోగానీ ఉత్పత్తి సంబంధాల పునరుత్పత్తితో గానీ - సంబంధమున్న విషయాలపైన మాత్రమే నిర్ణాయకత పనిచేస్తుందని రుజువు చేయడం సాధ్యమనీ తక్కిన విషయాలపైన ఆర్థిక విషయాల నిర్ణాయకత తప్పక పనిచేస్తుందని రుజువు చేయడానికి తర్కబద్ధమైన వాదన లేదనీ అంటారు. ఆమేరకైనా ఆర్థిక నిర్ణాయకత శక్తిగా పనిచేస్తుందా,

లేక ఆర్థికవిషయాలూ వాటితో సంబంధంఉన్న ఆర్థికేతర విషయాలూ (ఉదాహరణకు చట్టం) ఒక పరస్పర ప్రతిచర్యలో సమతుల్యాన్ని వెతుక్కుంటాయా అన్న ప్రశ్న పక్కన పెట్టినా, మతం, నీతి, తత్వశాస్త్రం మొదలయిన విషయాలన్నిటినీ పూర్తిగా తన చేతిలోకి తీసుకుని తన అవసరాల వెలుగులో తిరగరాయవలసిన అవసరంగానీ అంతటి ప్రభావంగానీ పెట్టుబడికి ఉండదని అర్థం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. అప్పుడు ఎంత ప్రభావం ఉందో అంత గుర్తించగలుగుతాం. ఆ ప్రభావానికి ఆవలనున్న విషయాలను విడిగా విశ్లేషించాలని అర్థం చేసుకోగలుగుతాం. అందులోని మంచిని మిగుల్చుకొని చెడునూ, అన్యాయాన్ని ఏ విధంగా అధిగమించాలో ఆలోచించగలుగుతాం.

పెట్టుబడి దారీవ్యవస్థను విపరీతంగా ద్వేషించే మేనిఫెస్టో అదే సమయంలో అది చరిత్రలో ఒక గొప్ప విప్లవాన్ని తీసుకొచ్చిందని పొగుడుతుంది. తద్వారా సమసమాజానికి బాట వేసిందని ప్రశంసిస్తుంది. ఈ విప్లవాత్మక కృషిలోని ప్రధాన అంశాలు మూడు. (ఈ అభిప్రాయం ఒక్క కమ్యూనిస్టు మేనిఫెస్టో లోనే కాదు, మార్క్సు రచనలన్నిటిలోనూ కనిపిస్తుంది).

1) అది మానవ ఉత్పాదనశక్తిని విపరీతంగా పెంచింది. అపూర్వమైన ఉత్పత్తిశక్తులను మనిషికి అందించింది.

2) విడివిడిగా చిన్న చిన్న ప్రపంచాలలో బ్రతుకుతున్న మానవ సమూహాల మధ్య అది సంపర్కాన్ని ప్రవేశపెట్టి వారందరినీ ఒకపెద్ద ప్రపంచంలో భాగం చేసింది. నిజమైన అర్థంలో మానవజాతి కాగల భౌతిక పరిస్థితులిప్పుడు మనిషి ముందున్నాయి.

ఈ రెండు మార్పుల వల్ల మనుషుల భౌతిక సంపద, జ్ఞానం పెరగడమే కాక మనుషుల ఆలోచనల పరిధి కూడా చాలా పెరిగింది. విశ్వవ్యాప్తమయింది. దీనికి మార్క్సు చాలా ప్రాముఖ్యం ఇస్తాడు. గ్రామీణ జీవితంలోని బావిలో కప్ప స్వభావమంటే ఆయనకు చాలా అసహ్యం. (రైతాంగం పట్ల ఆయనకున్న చులకన భావానికి ఇది కూడా ఒక కారణమే).

3) మధ్యయుగాల మానవ సంబంధాలలో ఉన్న నిస్వార్థత, దయ, కరుణ, మమేకత, ఆధ్యాత్మికత, మొదలయిన కృత్రిమమైన (అంటే దోపిడీకి ఆచ్ఛాదనమైన) సెంటిమెంట్లన్నిటినీ తొలగించి తమ నిజజీవితమేమిటో స్పష్టంగా చూసుకునే అవకాశం కార్మికులకు కల్పించింది.

ఈ మూడు అంశాలలోనూ పెట్టుబడిదారీవ్యవస్థ తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పును ఎవరు వ్యతిరేకించినా ప్రతిఘటించినా వారిని నిర్దాక్షిణ్యంగా తిరోగామివాదులు అని నిందించడానికి కమ్యూనిస్టు మేనిఫెస్టో వెనకాడదు. ఉదాహరణకు, మొదటి రెండు అంశాలలో పెట్టుబడిదారీవ్యవస్థ తీసుకొచ్చిన మార్పులవల్ల తమ ఉనికిని కోల్పోయి వీధిన పడతామని భయపడి దానిని నిరసించిన చేతివృత్తుల వారినీ రైతాంగాన్నీ మేనిఫెస్టో తిరోగామి (రియాక్షనరీ) వర్గాలు అంటుంది. వారి నిరసనను చరిత్రను వెనక్కి తీసుకుపోయే ప్రయత్నంగా అర్థం చేసుకుంటుంది. అప్పటి నుండి చైనా విప్లవం దాకా రైతాంగం పట్ల, గ్రామీణ జీవితం పట్ల చిన్న చూపుఉండడం కమ్యూనిస్టు రాజకీయాల లక్షణం అయింది. రైతాంగం, చేతివృత్తుల వారు, తమ (గతించి పోక తప్పని) పాత జీవితానికి సంబంధించిన చైతన్యాన్ని వదులుకొని తమ భవిష్యత్ రూపమైన కార్మిక వర్గ చైతన్యాన్ని పొందినప్పడే విప్లవంలో భాగం కాగలుగుతారని

మేనిఫెస్టో అంటుంది. ప్రోధన్, బాకునిన్ వంటి అనార్కిస్టులకు మద్దతు ఎక్కువగా చేతి వృత్తుల వారి నుండి రైతాంగం నుండి రావడం మార్క్స్ అనార్కిస్టుల పట్ల ప్రదర్శించిన విపరీతమైన అసహనానికి కారణం కావచ్చు.

బొల్షెవిక్‌లు (ముఖ్యంగా లెనిన్) ఈ విషయంలో కొంత భిన్నమైన దృక్పథాన్ని తీసుకొచ్చారు. రష్యాలో పెట్టుబడిదారీ సంబంధాలు పరిమితంగానే వ్యాప్తి చెందాయి. పెట్టుబడి పరిధిలోకి పూర్తిగా రాని విశాలమైన రైతాంగం ఉండింది. ఆ ప్రజానీకాన్ని తిరోగామి వర్గంగా కొట్టిపారేయకుండా కలుపుకొని పోవలసిన అవసరం ఉండింది. అయితే ఆధునిక పారిశ్రామిక రంగానికి చెందిన కార్మికులే శ్రామిక ప్రజల అగ్రగామి అన్న కమ్యూనిస్టు మేనిఫెస్టో సూత్రీకరణ దెబ్బతినకుండా కార్మికుల నాయకత్వంలో రైతాంగాన్ని కలుపుకోవాలని బొల్షెవిక్‌లు సూత్రీకరించారు. అయినప్పటికీ రైతాంగానికికమ్యూనిస్టు సంప్రదాయంలో ఆపాదించబడిన అభివృద్ధి నిరోధక గుణం పేరుతోనే బలవంతపు కలెక్టివైజేషన్‌లో భాగంగా స్టాలిన్ ప్రభుత్వం సోవియట్ రైతాంగంపైన విపరీతస్థాయిలో అమలు చేసిన హింసను సమర్థించుకోవడం జరిగింది. రైతాంగాన్ని గురించి మేనిఫెస్టో ప్రకటించిన అవగాహనను నిజంగా సవరించిన వారు గ్రాంసీ, మావో. మావో ఆలోచనా విధానం అంటూ ఆయనకు నిర్విచక్షణగా గొప్ప తాత్వికుడన్న బిరుదు ఇవ్వడం జరుగుతూ ఉంది. కానీ ఆయన కమ్యూనిస్టు రాజకీయాలకు చేసిన నిజమైన మేలు రైతాంగాన్ని అభివృద్ధి నిరోధక వర్గంగా భావించడం మానేసి సమాజ పునర్నిర్మాణంలో వారికి సముచిత స్థానం కల్పించడం. దీని అర్థం చైనా కమ్యూనిస్టు పార్టీ రైతాంగంతో ఎల్లప్పుడూ చాలా ప్రజాస్వామికంగా వ్యవహరించిందని కాదు. కార్మిక నియంతృత్వం పేరిట ప్రజలపైన పార్టీ నియంతృత్వాన్ని రుద్దడంలోనే సమస్యలున్నాయి. అది వేరే విషయం.

పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకొచ్చిన మొదటి రెండు మార్పుల పరిపూర్తికి పెట్టుబడిదారీ వ్యవస్థే అడ్డంకి. ఉత్పత్తిశక్తుల పెరుగుదలకు (ఒక దశ దాటిన తరువాత) పెట్టుబడిదారీ ఉత్పత్తిసంబంధాలే ఆటంకం. దానివల్ల ఉత్పత్తిశక్తుల పెరుగుదల కుంచించుకు పోతుంది. రెండు, చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఉత్పత్తికి నిజంగానే సామాజిక రూపం ఇచ్చిన పెట్టుబడి - విడివిడిగా జరుగుతున్న ఉత్పత్తిక్రియను విస్తృత శ్రమవిభజన ద్వారా ఒకటి చేసిన పెట్టుబడి - ఉత్పత్తి ఫలాన్ని మాత్రం సమాజపరం చేయకుండా వ్యక్తుల ఆస్తిగానే ఉంచేసింది.

ఈ వైరుధ్యాలను అధిగమించగల వర్గమే చరిత్రను ముందుకు తీసుకుపోయి నిజమైన మానవచరిత్రకు ప్రాతిపదిక అయిన సమిష్టి ఉత్పత్తి వ్యవస్థను నెలకొల్పుతుంది. అది, పెట్టుబడిదారీ ఫ్యాక్టరీలోనే పుట్టిన కార్మిక వర్గం. కార్మికవర్గం ఉత్పత్తి క్రియనే కాక ఉత్పత్తిఫలాన్ని కూడా సామాజికం చేస్తుంది. ఆ ప్రాతిపదికన ఉత్పత్తిశక్తుల నిరంతర ఎదుగుదలను సాధిస్తుంది. దీనికోసం కార్మిక వర్గం చేసే పోరాటం ఒక రాజకీయ పోరాటం. అది కార్మికవర్గ పాలన నెలకొనడంతో ఒక కొలిక్కి వస్తుంది. (ఈ పాలన వర్గనియంతృత్వంగా ఉంటుందన్న భావన మేనిఫెస్టోలో లేదు. తరువాత కాలంలో - మార్క్స్ రచనలలోనే - వచ్చింది). ఆపైన జాతి విభేదాలు, ఒక జాతిపైన మరొక జాతి పెత్తనం, స్త్రీ పైన పురుషుడి పెత్తనం (ఇవి మేనిఫెస్టో ప్రత్యక్షంగా పేర్కొనే విషయాలు)

మొదలైన అన్నిరకాల అసమానతలూ తొలగిపోవడానికి కావలసిన ప్రాతిపదిక ఏర్పడుతుంది.

మేనిఫెస్టో ఘంటాపథంగా చెప్పే విషయాలలో సందేహాస్పదమైనవి చాలా ఉన్నాయి. ఈ 150 సంవత్సరాల చరిత్ర ఏం చెప్తుందంటే పెట్టుబడి దారీ ఉత్పత్తి వ్యవస్థ తరచుగా సంక్షుభితంగా ఉన్నప్పటికీ అది ఉత్పత్తిశక్తులను నిరంతరం అభివృద్ధి చేస్తూనే ఉంది. ఎటొచ్చీ అభివృద్ధి అనేక విషయాలలో అమానవీయ రూపం తీసుకోవడమే కాక పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నది. అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి నిలిచిపోవటం సమస్యకాలేదు, అది వికృత రూపం తీసుకోవటం సమస్య అయింది. ఇప్పడు కావలసినది మరింతగా ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేసే వ్యవస్థా లేక ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా నియంత్రించి అభివృద్ధి వేగాన్ని మందగింపచేసి జరిగిన ఉత్పత్తి అందరికీ అందేటట్లు చూసే వ్యవస్థా అనేది ఈనాటి ప్రశ్న.

రెండవది, పెట్టుబడి సృష్టించిన ఉత్పత్తిశక్తులను సమిష్టి ప్రాతిపదికన పునర్నిర్మాణం చేసి నిరంతరాయంగా ముందుకు తీసుకుపోగల వర్గం చేతిలోనే భవిష్యత్తు ఉందనే ఈ సిద్ధాంతం అన్నిపీడిత వర్గాలలోకీ పారిశ్రామిక కార్మిక వర్గానికి పెద్ద పీటవేసింది. రైతాంగం, చేతివృత్తుల వారు, గతాన్ని అంటి పెట్టుకున్న తిరోగామివాదులుగానూ మతం వంటి భావజాల వ్యాప్తికి అనువయిన సరుకుగానూ కనిపించగా, ఆర్థికేతర పీడన అనుభవించే ప్రజల స్థానం ఏమిటో అర్థం కాదు. ఆ పీడనలన్నిటినీ పెట్టుబడి ఒక బుల్‌డోజర్ లాగ కూలదోసి ఆస్తిలేని వారినందరినీ వట్టి కార్మికులుగా (జాతిలేని, ప్రాంతం లేని, జెండర్ లేని, కులం లేని వట్టి శ్రమ విక్రేతలుగా) మారుస్తుందన్న భరోసాతో వాటి గురించి ఆలోచించడం అనవసరం అయిపోయింది.

కానీ నిజానికి పెట్టుబడి అంతటి బుల్‌డోజర్‌గా పనిచేయలేదు. చేయవలసిన అవసరం దానికి లేదు. మరి పారిశ్రామిక కార్మికులు నిర్మించబోయే సమిష్టి ఉత్పత్తివ్యవస్థ అన్ని ఆధిపత్యాలను అంతం చేస్తుందని నమ్మగలమా? నమ్మడానికి హేతుబద్ధమైన కారణాలేవీ లేవు. సమిష్టి ఉత్పత్తివ్యవస్థ దానంతటది కాంక్షనీయమైనదే. పెట్టుబడిదారీ ఉత్పత్తివ్యవస్థకు అది తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదన్న మార్క్స్ ఆలోచన సహేతుకమైనదే. అది ఏ రూపంలో, ఏ విధంగా సాధ్యం అవుతుందన్న ప్రశ్న 20వ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగాల వైఫల్యాల నుండి మనకు మిగిలింది. అయితే అది ఏ రూపంలో సాధ్యమైనా దానినుండి మిగిలిన మార్పులన్నీ రావు. రాకపోగా అవి దీనికి ప్రతిబంధకాలవుతాయి. దేనికోసం జరగవలసిన ప్రయత్నం దానికోసం జరగవలసిందే. ఈ ప్రయత్నంలో 'అగ్రగామి' ఏదీ లేదు, ఎవరూ లేరు, ఉందనుకోవడానికి సహేతుకమైన కారణమేదీ లేదు. అన్ని ప్రయత్నాల ప్రజాస్వామిక సమాహారంగా ప్రగతిశీల రాజకీయకృషి సాగాలి. ఇందులో అగ్రగామి అన్న భావనకుగానీ ఒకరి నియంతృత్వానికిగానీ తావు ఉండదు. ఈ ప్రయత్నం గడచిన చరిత్రలో ముందుకొచ్చిన నాగరికతా విలువలనూ నియమాలనూ 'భావజాలం' అని కొట్టి పారేయకుండా, వాటిలోని ప్రజాస్వామిక అంశాలను స్వీకరిస్తుంది, పెంపొందిస్తుంది. సమాజ పునర్నిర్మాణంలో భాగం చేస్తుంది.